


పాపికొండల నడుమ ప్రవహిస్తోంది గోదావరి. పాపికొండల ఒడ్డున నడిచొస్తోంది పల్లెపిల్ల గోదారి.

మెట్టభూముల్లో మిరపచేలు పండాయి. ఆకాశంలో సంజెచీకట్లు నిండాయి. గడ్డమోపు నెత్తుకొని చుక్కల చీర వొంటిని చుట్టుకుని వొయ్యారంగా నడుస్తోంది గోదారి. ఒంపులలో సుళ్ళుతిరిగి పారుతోంది గోదావరి. వొయ్యారాల వూపుల్లో గోదారి గోదావరితో పోటీపడుతున్నట్లుంది.

కొత్తిమీర కట్టలాంటి జుత్తు వొత్తికట్టింది గోదారి. ఎత్తయిన పిరుదులు బండిచక్రాల్లా గుండ్రంగా కదులుతున్నాయి గోదారి నడకకు. ఎత్తయిన యిసుక దిబ్బల్ని వొరిపి పారుతోంది గోదావరి. ఆ ప్రవాహం ఆగనిది.

ప్రవాహంతో పోటీగా నడుస్తోంది గోదారి.

ఒంటరితనాన్ని చీల్చుకుంటూ రివ్వున చలిగాలి చెవులను తాకింది. 'గోదారి' అనే పిలుపు ఆమె చెవులకు సోకింది. వెనుదిరిగింది గోదారి. దూరంగా కుక్కతోకలాంటి వొంకరి కర్రను చేత్తో పట్టుకొని మీసం మెలేస్తూ పరుగులాంటి నడకతో వెంట పడ్డాడు భైరవుడు.

"మాట... ఆగహే... నిన్నే" భైరవుడు అరిచాడు.

వయసుడుగుతున్నా మునుపటి పొగరు అణిగి నట్లు లేదు.

"ఏటి పని, నా యెనకాల ఎందుకు పడ్డావు..." గోదారి పైటజార్చి పట్నం జాణతనాన్ని భైరవుడి మీద ప్రయోగించింది.

ఆబగా ఎగాదిగా చూస్తున్నాడు భైరవుడు. చటుక్కున పైట సర్దుకొని నడక సాగించింది గోదారి.

'ఏటే ఆ పొగరు... ఆగమంటే నిన్నుగాదటే' వెంబడించాడు భైరవుడు.

"నువ్వాగమన్నప్పుడు ఆగడానికి, ఉండమన్న చోట వుండడానికి నేనేం నువ్వుకట్టుకున్న దాన్ని కాదు." గిరుక్కున తిరిగి చురుక్కుమనేలా చూపింది గోదారి.

"కట్టుకున్నదానివైతే నీ యెనకాల పడాల్సిన అవసరం లేదే" తరతరాల పురుషాహంకారం తన్నుకొచ్చింది భైరవుడిలో.

"ఓయబ్బో! మా యప్పకాడకెల్లి సెప్పుసి గొప్పలు నాకాడ గాదు." యికటంగా నవ్వుకుంది గోదారి. అవకాశం సెయిజారిపోతాదేమోనని అను మానమొచ్చింది భైరవుడికి. వెంటనే.........

"మీ యప్పకి నోయసైపోవాదే! దాన్దేముంది గాని నొట్టుగుంటే నీలాటిదాన్నే... మా రంజుగుం టాది.

నాయాల్ది 'పట్నంపోయి వొచ్చినకాడమండి దొరకేగాని నాకు దొరక్కుండాపోయావు... నా మీద గోపమొచ్చిందేటే..."

భైరవుడి రాజీమంత్రం గమనించి, దారిలోకొచ్చా డు యాకికీ నేర్పాల గుణపాఠం అనుకుంది గోదారి. పైకి మాత్రం ముభావంగా.

"ఛా! నీ మీద నాకు గోపమున్ది మా... నా!" నువ్వంటే నాకు మొదట్నుంచీ యిదే. గాకపోతే ఆరోజు దొరకాడికి బలవంతంగా లాక్కెల్లావనే నా బాధ!"

"సర్లే పాతసంగతులెందుకు గాని, పట్నం మండి యెందుకే తిరిగొచ్చేసావు...?? అంటూ భైరవుడు గోదారి గడ్డిమోపు దించి యిసకపర్రమీద సుతారంగా కూర్చోబెట్టాడు.

భైరవుడి కక్కుర్తికి కిసుక్కున పైకే నవ్వింది గోదారి.

"ఏందే నవ్వుతావ్" అంటూ గోదారి భుజం పట్టుకొని వొళ్ళోకి లాక్కున్నాడు భైరవుడు. తనని ఆక్రమించుకుంటున్న భైరవుడ్ని ఆపే ప్రయత్నం చెయ్యలేదు గోదారి. ఆమె మౌనాన్ని అంగీకారంగా తీసుకున్నాడు భైరవుడు.

చీకట్లు ముసురుకుంటున్నాయి. దూరంగా రాజమండ్రీ వీధిదీపాలు వెలుగందుకున్నాయి. పట్నం మండి తిరిగొచ్చిన గోదార్ని పట్టుబట్టి నలిపేస్తున్నాడు భైరవుడు. చీకట్లో పొర్లాడుతున్న ఆ శరీరాలకు కొంచెం దూరంగా......

గోదావరిలో మునకలేస్తూ ఓ కుక్క తలమునక లౌతోంది. భైరవుడికి ఒళ్ళప్పగించిన గోదారికి మంటగా ఉన్ది. గతం గుర్తుకొస్తోంది. రోతగా వొగరుస్తోంది గోదారి స్మృతిపథంలో...........

★ ★ ★

ఊరు పడాల. పేరు గోదారి. వయసు పదహారు. పాపికొండల కనుమల్లోని పల్లె "పడాల." ఊర్లో మోతుబరి పడాల దొర. డబ్బుగల ఆసామి

దొరతనాన్ని కాదనలేని అమాయకులా పల్లెప్రజలు. గోదావరి నిండుతనం ఆ పల్లె వ్యవసాయానికి మూలధనం.

పల్లెపిల్ల గోదారికి మావ పాపికొండ. పేరుకు తగ్గట్టే పడాల దొర పాపాలకు అద్దుకొండ. దొరపోసే విప్పసారాకు బానిసలైన వారిలో పాపం పాపికొండ ఒకడు. లంకల పొలంలో దొరికిన కూన గోదారి. పదేళ్ళక్రితం దొరపనిమీద పొలం పోయివస్తూ, వెంటబెట్టుకొచ్చాడు గోదార్ని పాపికొండ.

పాపికొండకు ముసలితనంలో సంజేలకు గంజి పోసే దిక్కయ్యింది గోదారి.

పడాలకు ఆమడదూరంలో ఉన్నాయి పాపికొండలు. పాపికొండల నడుమ ప్రవహిస్తోంది గోదావరి. గోదావరి ప్రవాహం నిదానంగా ఉంది. ఓ నిండుతనాన్ని సంతరించుకుంది.

పదహారేళ్ళ పడుతుదనంలో గోదారి మళ్ళ దారంట ఉల్లిమోపులను మోసుకెళుతోంది. దారిలో అటకాయించాడు భైరవుడు. పెయ్యట్టుకొని "ఆగవే... ఏటా తొందర... ముందు దొరగారి కళ్ళంలోకి పద." తొట్రుపడింది గోదారి.

"నాను... నానెందుకు"

"నానెందుకేటే? దొండపండు లాగున్నావ్. మనసయ్యింది రమ్మన్నాడు దొర."

"అయితే మా మావ పాపికొండ నడగమని మనువిత్తాడేమో...!"

"ఆడ్నడిగేదేంటే! దొర ఓ కేటు యిప్పసారా పంపాడు."

"మా మావ ఏటన్నాడు"

"ఆడేటంటాడే యెర్రిమొకమా! కబురంపింది దొరా, మజాకానా! పుల్లితోటకెల్లింది. ఆడకు బోయి దాన్నే అడగండేహే!" అన్నాడు.

"అంటే"

"అంటే నేదు గింతే నేదు. దొర రమ్మన్నాడు రాయే" చెయ్యట్టుకు గింజాడు భైరవుడు.

"నాను రాను........ పెయ్యొగ్గు..."

రెక్కట్టుకొని భైరవుడు లాగబోతే కాలితో ఓ తన్ను తన్నింది గోదారి. కడియం దెబ్బకు కళ్ళు తిరిగినంత పనయ్యింది భైరవుడికి. గోదారి పరుగులంకించుకంది.

చిరతబారిని తప్పించుకొని సింగానికి దొరికినట్టు దొరకంట పడింది గోదారి. దొరికించుకున్నాడు దొర. గోదారితో దొర్లాడు. దొరపనిని చోద్యంలా చూస్తూ మంచున్నాడు భైరవుడు.

నీరసంగా లేచి నడుస్తోంది గోదారి. వెనకాతల చడికాగి చూసింది గోదారి. ఆగిందే తడవుగా చుట్టుకున్నాడు భైరవుడు. గుంజుకొని పరుగెత్తింది గోదారి.

పాపికొండల ఒడ్డున గోదారి. ఒడ్డుకవతల తన మావ పాపికొండ.

"మావా" అరుస్తోంది గోదారి. ఆ కేక అనంత విశ్వంలోకి వినిపిస్తోంది. కాని పాపికొండ గుడిసెకి చేరలేదు. పరుగుతో కాలుజారింది గోదారి. గోదారి దొర్లి గోదావరిలో కలిసి పోయింది. అక్కడ మునిగి ఇక్కడ రాజమండ్రి ఒడ్డున తేలింది గోదారి.

★ ★ ★

పాపం ఆడపిల్లని ఆసుపత్రిలో చేర్పించారు. బాచులర్ స్టూడెంట్లు. ఆరోగ్యం కుదుటపడగానే డిస్చార్జిచేసి పొమ్మన్నారు డాక్టర్లు.

ఏడకు పోవాలో తెలియని గోదార్ని తమవాడకు తీసుకొచ్చారు స్టూడెంట్లు. వయసులోవున్న కుర్రాళ్ళకు వాడ మరదలయ్యింది గోదారి. డబ్బిచ్చి ఆదరిస్తున్నామన్న సంస్కారం వాళ్ళకబ్బింది. అనుభవాలు పెరిగిన కొద్దీ ఆరోగ్యం క్షీణించింది గోదారికి.

ఆసుపత్రులకు పోలీస్టేషన్లకు తిరగ లేక అల్లల్లాడిపోయింద గోదారి. అదే సమయంలో పరిచయమయ్యాడు పత్రికా విలేఖరి ఆచారి. ఆమె కథవిన్న ఆచారికి ఏనుగు లక్ష్మణకవి అనువాదం గుర్తుకొచ్చింది. ఆకాశంబున నుండి శంభుని శిరంబందుండి.................. వివేక పుష్ప సంపాత ముల్" అనే పద్యాన్ని ఉటంకిస్తూ ఓ గొప్ప వ్యాసం వ్రాసాడు ఆచారి.

"నీకెవరి మీదా కోపం లేదా గోదారీ" అని ప్రశ్నించాడు ఆచారి.

"అసహ్యంలో ఖూడా ఆనందాన్ని అన్వేషిస్తూ అనుభవించగల ఈ లోకంలోని మనుషుల మీద నాకేమాత్రం కోపం లేదు. వాళ్ళు నా దగ్గరకు రాకమానరు. కాబట్టే వాళ్ళకు దూరంగా పోతాను. నా బ్రతుకునిట్లా బుగ్గిపాలుచేసిన మా వూరు దొర, భైరవులపై కక్షసాధించాలి. అదే నా జీవితంలోని చివరి మజిలీ. వాళ్ళకి నాలాంటి వాళ్ళద్వారా తప్పక "కొణుకుడు" పడాలి.

ఆడదంటే అబలకాదని, "అంటూ అదే ధృతనిశ్చయంతో మళ్ళీ పడాల చేరింది గోదారి."

ఆఖరి ఊపులోని తమకం నుండి బైటపడ్డాడు భైరవుడు. ఏదో మంటగా వుంటే గోదావరి నీళ్ళల్లో పక్షాళన చేసుకొచ్చినా ఆ బాధ తీరటం లేదు భైరవుడుకి.

"ఏటే గోదారీ... ఏటి బాధ... నీ తల్లి సిగదరగా బురదగుంట నునుకోలేదే" పళ్ళు బిగబెట్టి కస్సిర చేసాడు భైరవుడు.

"బురదలో నీళ్ళోసి కుమ్మితే మురికంటదంట్రా భైరవా! నీ కుక్కబుద్ధికి మందు ఈ "కొణుకుడు జబ్బు."

బ్రతికినంతకాలం ప్రాణాలు తోడేస్తుంది. నీకూ మీ దొరకి తగిన బుద్ధిచెప్పాలనే మళ్ళీ వచ్చిందీ గోదారి. పవిత్రమైన నాటిని పాడుచేస్తే ఆ పాపం వూరకపోదురా దొంగనాయాలా! కుళ్ళిపావు" అంటూ గలగలా నవ్వుతూ గోదావరిలోకి దొర్లిపోయింది గోదారి.

●



